ప్రజాశక్తి
గురువారం 23 జనవరి 2025 5 అనంతపురం





విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

పేరుకే 'స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్'

నామ మాత్రంగా చెత్తతో సంపద కేంద్రాలు
ఇరిగేషన్ చెరువులే డంపింగ్ కేంద్రాలు
కలుషితమవుతున్న చెరువు నీరు
నిద్రావస్థలో ఆయాశాఖల అధికారులు



చెరువులో వేసిన వ్యర్థాలు

ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం పారిశుధ్యకార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టింది. స్వచ్ఛ భారత్‌లో భాగంగా చెత్తతో సంపద తయారు చేసే కేంద్రాలు మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ కేంద్రానికి ఒక్కటి చొప్పున ఉన్నాయి. అయితే ఈ చెత్త కేంద్రాలను నామ మాత్రంగా నిర్వహిస్తూ సేకరించిన తడిపొడి చెత్తను ఇరుగేషన్ చెరువులలో వేస్తుండటం ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. మండల కేంద్రం కావడంతో అత్యధిక సంఖ్యలో దుకాణాల నుండి వ్యర్థాలు వెలువడుతుంటాయి. అయితే వాటికి తగ్గట్టుగా పంచాయతీలో పారిశుధ్య పనుల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. మండల కేంద్రంలో సేకరించిన తడి, పొడి చెత్త ను చెత్త కేంద్రంలో డివైడ్ చేసి వర్మీ కంపోస్ట్ గాను, ప్లాస్టిక్ రీసైకిలింగ్ చేసి అమ్మడం ద్వార సంపదను సృష్టించాల్సుంది. అయితే సేకరించిన చెత్తను చిలమత్తూరు చెరువు, బైరే కుంట చెరువులో వేస్తూ ఇరిగేషన్ చెరువులను కలుషితం చేస్తున్నారు.

నామమాత్రంగానే చెత్త కేంద్రాలు

చిలమత్తూరు గ్రామ పంచాయతీలోని చెత్త కేంద్రాన్ని నామ మాత్రంగా నిర్వహిస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి సంపదగా మార్చాల్సిన అధికారులు ఆ పని చేయడం లేదు. కొన్ని తొట్టెలలో వర్మీ కాంపోస్ట్ తయారు చేస్తున్నట్లు చూపుతున్నా ఆ వర్మీ కంపోస్ట్ ద్వారా పంచాయతీకి వచ్చిన ఆదాయం నామ మాత్రంగా కూడా లేదు. ప్లాస్టిక్ రీసైకిలింగ్ కోసం పెద్ద పెద్ద యంత్రాలు ఉన్న వాటి ద్వారా రీసైకిల్ చేసి పొందిన ఆదాయం కూడా ఏమి లేదు. మండల కేంద్రంలో సంత ప్రాంతంలో ఈ చెత్త కేంద్రాలను షోగా చూపిస్తూ మొత్తం చెత్త,వ్యర్థాలను చెరువులలో వేస్తూ డంప్ కేంద్రాలుగా వాటిని మార్చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలలో సమస్యలు

డివి అండ్ ఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు భాగాన ఉన్న బైరే కుంట చెరువు పక్కనే ఉన్న గంగమ్మ గుడి చుట్టు పక్కన చెత్తతో పాటు, కోళ్ల వ్యర్థపదార్థాలు వేస్తుండటంతో దుర్వసన వెదజల్లుతోంది. దీంతో కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అలాగే హిందూపురం ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో వాహనాలను కుక్కలు అడ్డుగా వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికి అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.

పట్టించుకోని పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు

ఓ విద్యాలయం, ఓ దేవాలయం, పైగా మండల కేంద్రం సగానికి నీటిని అందించే తాగునీటి పంచాయతీ బోరు, హిందూపురానికి వెళ్లే ప్రధాన రహదారి ఇన్ని ఉన్న చెరువు కట్ట ప్రాంతంలో చెత్త వేసేందుకు అనుకూలంగా ఉందని పంచాయతీ అధికారులు అనుకున్నారో ఏమో ఈ ప్రాంతంలో చెత్తను వేస్తున్నారు. ఓ వైపు ఇరిగేషన్ చెరువు కాలుష్యంలో చిక్కుకుంటున్నా, కోళ్ల వ్యర్థాలు ప్లాస్టిల్ వ్యర్థాలతో భూ గర్భ జలాలు కలుషితం అవుతున్నా, వ్యర్థాలను ఆహారంగా తీసుకునేందుకు వచ్చిన కుక్కల వల్ల ప్రమాదాలు జరుగుతున్నా ఇటు ఇరిగేషన్, అటు పంచాయతీ అధికారులకే ఏమాత్రం పట్టడం లేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఈ చెత్త ను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



చెరువు గట్టుపై వేసిన వ్యర్థాలు



కుంట చెరువు గంగమ్మ గుడి వద్ద ఉన్న కోళ్ల వ్యర్థాలు తింటున్న కుక్కలు

హంద్రీనీవా కాలువ వెడల్పు కోసం
27 నుంచి రాయలసీమ వ్యాప్తంగా ధర్నాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

హంద్రీనీవా కాలువను పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలన్న డిమాండ్‌తో సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి రాయలసీమ వ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప,కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఆర్. చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.కృష్ణమూర్తి, వి.రామిరెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయలసీమ జిల్లాలైన కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, మదనపల్లి జిల్లాలకు హంద్రీనీవా ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 6 లక్షలకు పైగా ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వల్సుందన్నారు. 2012 నుంచి కర్నూలు, అనంతపురం జిల్లాలకు నీరు వస్తున్నా ఒక్క ఎకరం ఆయకట్టుకు సాగు నీరు ఇవ్వకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మొదటి దశ కింద అనంతపురం జిల్లాలో 3.45లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వడానికి పంట కాలువలు తవ్వలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా రాయలసీమ సాగునీటి వనరుల అభివృద్ధి ఆశించినంతగా జరగడం లేదన్నారు. పంట కాలువల కోసం భూసేకరణ కూడా పూర్తి అయిందన్నారు. హంద్రీనీవా నుంచి 10 వేల క్యూసెక్కుల నీరు రావడానికి కాలువ వెడల్పు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 3450 క్యూసెక్కుల నుంచి 6300 క్యూసెక్కుల నీరును విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిందన్నారు. ప్రస్తుతం కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ వేయడానికి 404, 405 జీవోలను విడుదల చేసిందన్నారు. రూ.930 కోట్ల నిధులను విడుదల చేసిందన్నారు. అయితే కాలువ వెడల్పు చేయకుండా ఇది సాధ్యమయ్యే పరిస్థితి లేదన్నారు. కాలువ లైనింగ్ పనుల వలన భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందన్నారు. ఇదే భావనను రైతు సంఘాలు జలసాధన కమిటీ ఇతర రాజకీయ పార్టీలు వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేయడం, పంట కాలవలను తవ్వడం కార్యక్రమాలను తక్షణం చేయాలని కోరుతూ రాయలసీమ జిల్లాలలో ఈ నెల 27న అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27 న అనంతపురం హంద్రీనీవా సుజల స్రవంతి సర్కిల్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతులు, ప్రజలు, మేధావులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్ నమ్మొద్దు

మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి



ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపాలిటీ పేరిట అపరిచితుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే నమ్మొద్దని, తాము ఎవరికీ ఫోన్ చేయడం లేదని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని పవిత్ర ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు చంద్రశేఖర్‌కు సెల్..63052 70329 నెంబర్ నుంచి అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి తాను మున్సిపల్ కమిషనర్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానని, మీ ట్రేడ్ లైసెన్స్ ఫీజు పెండింగ్ ఉందని తక్షణం గూగుల్ పే ద్వారా సొమ్ము పంపితే లైసెన్స్ ఫీజు జమ చేస్తామని తెలిపారు. ఈ ఫోన్‌కాల్‌పై అనుమానంతో చంద్రశేఖర్ తిరిగి అదే నెంబర్‌కు ఫోన్ చేసి ఈ నెంబర్ గూగుల్ పే పని చేయడం లేదని చెప్పాడు. తిరిగి అవతలి వ్యక్తి సెల్..75920 05638 నెంబర్‌కు చేయాలని మళ్లీ నెంబర్ ఇచ్చాడు. దీంతో చంద్రశేఖర్ నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని కమిషనర్‌ను కలిసి వివరాలను ఆరాతీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాము అలాంటి కాల్స్ చేయలేదని, అది సైబర్ నేరగాళ్ల పని అన్నారు. వ్యాపారులను మోసం చేసేందుకు పన్నిన కుట్ర అయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయానికి ఎలాంటి ఫోన్‌పే, గూగుల్‌పే అకౌంట్ లేదని.. లైసెన్స్ ఫీజులు చెల్లించాల్సి ఉంటే నేరుగా కార్యాలయానికి వచ్చి కౌంటర్‌లో సొమ్ము చెల్లించి రసీదు పొందాలన్నారు. ఒకవేళ మున్సిపల్ సిబ్బంది పన్ను వసూలుకు వ్యాపారుల వద్దకు వస్తే డబ్బులు కట్టిన తర్వాత వెంటనే రసీదులు పొందాలని సూచించారు. అనంతరం నకిలీ ఫోన్‌కాల్స్‌పై రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సేంద్రీయ పద్ధతిలో సాగు చేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-ఆత్మకూరు

రైతులు సేంద్రీయ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులతోపాటు అధిక ధర లభిస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ సూచించారు. బుధవారం మండలంలోని వడ్డుపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన రైతు లక్ష్మీదేవి గారి పొలంలో జెడ్‌బిఎన్ఎఫ్‌లో భాగంగా ఏ గ్రేడ్ నమూనాలో సాగు చేస్తున్న వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతుల ద్వారా కూరగాయలు, ఆకుకూరలను మాత్రమే పండిస్తున్నారన్నారు. మిగిలిన పంటలను కూడా సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేయడానికి కృషి చేయాలన్నారు. వీటి సాగు ద్వారా కుటుంబ అవసరాలకే కాకుండా, రైతు ఆర్థికంగా కూడా లాభపడవచ్చన్నారు. గ్రామంలోని మిగిలిన రైతులు ఈ పద్ధతిలోనే సాగు చేసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి సుచరిత, ఎఇఒ సుజిత, సర్పంచు, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ


'నకిలీ బంగారం' ముఠా అరెస్టు

ప్రజాశక్తి-సోమందేపల్లి

నకిలీ బంగారం చూపి ప్రజలను మోసం చేస్తున్న పది మందితో కూడిన ముఠాను బుధవారం అరెస్టు చేసినట్లు పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని స్టేషన్లో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సిఐ రాఘవన్, స్థానిక ఎస్ఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను డీఎస్పీ వెంకటేశ్వరరావు వెల్లడించారు. సోమందేపల్లి మండల కేంద్రానికి చెందిన ఇద్దరు ఈడిగ హరిప్రసాద్, పిచ్చుకుంట్ల మారెప్ప, అన్నమయ్య జిల్లాకు చెందిన ముగ్గురు రానాకృష్ణబాబు, గోవిందుల ఆనంద్ బాబు, పోమారి బంగారి,కర్ణాటక రాష్ట్రం తుమ్ముకూరుకు చెందిన ఇద్దరు నయాజ్ అహ్మద్, ఏఆర్ శాంతరాజ్, చిక్‌బల్లాపూర్ జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్ బాబు, షికారి అర్జున్, ఎస్ బాబు ఒక ముఠా గా ఏర్పడి నకిలీబంగారాన్ని అమాయకులకు అంటగట్టేవారు . బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.21 లక్షల నగదు, ఐదు ద్విచక్రవాహనాలు, ఐదు కీప్యాడ్ సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

'డాకు మహారాజ్' సక్సెస్ మీట్ విజయవంతం

ప్రజాశక్తి -అనంతపురం



సక్సెస్ మీట్‌లో మాట్లాడుతున్న బాలకృష్ణ

అనంతపురం నగరంలో బుధవారం సాయంత్రం జరిగిన డాకు మహారాజ్ సక్సెస్ మీట్ విజయవంతంగా నడిచింది. నగరంలోని అయ్యప్ప గ్రౌండ్స్ లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సినిమా ప్రిరిలీజ్ ఈవెంట్ ఇక్కడ జరగాల్సి ఉండగా తిరుపతిలో జరిగిన ఘటనతో అప్పుడు వాయిదా పడింది. ఇప్పుడు ఈ సినిమా విజయోత్సవ సభగా జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం నాయకులు ,బాలకృష్ణ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్కడ ఎటువంటి ఘటన చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సినిమా విజయవంతం చేయడంలో భాగస్వామ్యులైన అందరినీ హీరో బాలకృష్ణ అభినందించారు. రాయలసీమ ప్రాంతమంటే సాధారణమైంది కాదని అన్నారు. 'రాయల్ సీమ అని పేర్కొన్నారు. ఈ ప్రాంత ఇతివృత్తంగా తీసిన తన సినిమాలు గతంలోనూ ఘన విజయాలు సాధించాయని గుర్తు చేశారు. ఇప్పుడు వచ్చిన డాకు మహారాజ్ అటువంటిందే అన్నారు. ఈ సినిమా విజయవంతం చేయడంలో కృషి చేసిన దర్శకుడు బాబి .సంగీత దర్శకుడు థమన్, ఇతర సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో హీరోయిన్లుగా నటించిన ప్రజ్ఞ జైశ్వాల్ ,శ్రద్ధ శ్రీనాథ , దర్శకుడు బాబి, సంగీత దర్శకుడు తమన్ తో పాటు సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. వీరితోపాటు ఎంపీలు అంబికా లక్ష్మీ నారాయణ ,బి కె పార్థసారథి , విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకట ప్రసాద్, ఎంఎస్ రాజు, పల్లె సింధూర, మాజీమంత్రి పల్లె రఘనాథ రెడ్డి, బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు గేసు , జగన్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

శ్రీశ్రీ నగర్‌లో రోడ్లు, కాలువలు నిర్మించాలి

కమిషనర్‌కు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నిరుపేదలు అత్యధికంగా నివసిస్తున్న శ్రీశ్రీ నగర్ కాలనీలో రోడ్లు, కాలువలు నిర్మించడంతోపాటు ఇంటి గుత్తలు కట్టించుకోవాలని సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు వలి, ప్రకాష్ కోరారు. ఈమేరకు బుధవారం నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ శ్రీశ్రీ నగర్‌లో గత ప్రభుత్వంలో 178 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. అయితే అప్పట్లో కాలనీలో రోడ్లు, కాలువలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.28 లక్షలతో టెండర్లు వేసిందన్నారు. ఎన్నికలు రావడంతో ఆ టెండర్లు ఆగిపోయాయని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కాలనీకి రోడ్లు, కాలువల నిర్మాణానికి టెండర్‌లు వేశారని, కానీ ఇంత వరకు పనులు ప్రారంభించలేదన్నారు. ఆ టెండర్‌లు కూడా రద్దు చేసినట్లు తెలుస్తోందన్నారు. పేదలు నివసిస్తున్న కాలనీల పట్ల ప్రభుత్వాలకు నిర్లక్ష్యం తగదన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను ఇటీవల కలిసి సమస్యలపై విన్నవించామని తెలిపారు. తక్షణమే కాలనీలో మౌళిక సదుపాయాలు కల్పించి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించి జీవిత భద్రతను కల్పించాలని కోరారు. స్పదించిన కమిషనర్ పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు ఇస్మాయిల్, రాఘవ, కుమార్, బువమ్మ, అమీర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సిని ప్రకటించాలి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలి-యుటిఎఫ్ నాయకుల వినతి



కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే ప్రకటించి అమలు చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌విపి రమణయ్య, జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు కోటేశ్వరప్ప, రాష్ట్ర నాయకులు దేవేంద్రమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ వసంతలత కలిసి వినతిపత్రం కలెక్టర్‌కు అందజేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆయా జిల్లాల కలెక్టర్‌కు విజ్ఞపనలు అందజేస్తున్నారని, అందులో భాగంగా యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ అధికారులను కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. 12వ పి.ఆర్.సి కమిషన్ నియమించి ప్రకటించాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. 1-7-2023 నుంచి అమలు కావలసిన 12వ పే రివిజన్ కమిషన్‌ను కూడా నేటికి కనీసం నియమించకపోవడం, ఈ కాలయాపన వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులు 12వ పి.ఆర్.సి ను 18 నెలల కాలాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. అంతేకాకుండా గత 11వ పిఆర్‌సికి సంబంధించిన బకాయిలు రూ.7384 కోట్లు, డిఎ బకాయిలు రూ.9650 కోట్లు, ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన సరెండర్ లీవ్ బకాయిలు రూ.2250 కోట్లు, సిపిఎస్ ఉద్యోగుల మ్యాచింగ్ గ్రాంట్ బకాయిలు రూ.2500 కోట్లు, ఏపీజిఎల్ఐ బకాయిలు రూ.950 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ పి.ఆర్.సికి సంబంధించిన కమిటీని వెంటనే ప్రకటించాలని, ఐఆర్ 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2004 ముందు నోటిఫికేషన్ ఇచ్చి 2004 తర్వాత నియామకం పొందిన 11 వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే యూటీఎఫ్ కలిసివచ్చే అన్ని ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు నాగేంద్ర, వేణుగోపాల్ రెడ్డి, నాయకులు ముసలప్ప, ఆదిశేషయ్య, గంగాధర్, పవన్ కుమార్, మహమ్మద్ గౌస్, బాబురావు, శివప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జొన్న ఇగురు తిని 40 గొర్రెలు మృతి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

జొన్న ఇగురుతిని 40 గొర్రెలు మృతిచెందిన ఘటన బుధవారం మండలంలోని కొండూరు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. గొర్రెల యజమానులు తెలిపిన మేరకు.. చింతాకుల రామకృష్ణ, గోపాల్, నాగభూషణ, సన్నప్ప కలిసి మేత నిమిత్తం గొర్రెల మందను కొండూరు గ్రామ సమీపంలోని ప్రాంతానికి తీసుకెళ్లారు. అయితే అక్కడ ఓ పొలంలో జొన్న ఇగురును గొర్రెలు తిన్నాయి. దీంతో దాదాపు 40 గొర్రెలు ఘటనా స్థలంలోనే మృత్యువాత పడ్డాయి. గొర్రెలను చూసి కాపరులు లబోదిబోమన్నారు. మృతిచెందిన గొర్రెల విలువ సుమారు రూ.4 లక్షల వరకూ ఉంటుందని వాపోయారు. ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు.





మృతిచెందిన గొర్రెల వద్ద విలపిస్తున్న కాపరులు

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న రైతుసంఘం, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ఇటీవల మండలం చెర్లోపల్లి గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న యువరైతు చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రశేఖర్‌రెడ్డి ఐదెకరాల పొలంలో నిమ్మ, చీనీచెట్లు సాగు చేశాడన్నారు. అయితే పంట చేతికి వచ్చే సమయంలో భూగర్భజలాలు అడుగంటి నీరు లేక ఎండిపోయే స్థితికి చేరుకున్నాయన్నారు. ఈనేపథ్యంలో పంట పెట్టుబడికి తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక చంద్రశేఖర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కావున వెంటనే చంద్రశేఖర్‌రెడ్డి బ్యాంకులో తీసుకున్న రుణాన్ని మాఫీ చేయడంతోపాటు కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజారామిరెడ్డి, పెద్దపప్పూరు మండల కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, నాయకులు కె.శ్రీనివాసరెడ్డి, సి.రమేష్, సిఐటియు నాయకులు ఉమాగౌడ్, శివారెడ్డి, కేశవ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


పశువైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు, రైతులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ ప్రసాద్ కోరారు. బుధవారం మండల పరిధిలోని నరసాపురం, గంగవరం గ్రామాల్లో పశు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. పశు వైద్య శిబిరాన్ని కళ్యాణదుర్గం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోమార్లు, పిడుదులు, పేన్లు సమస్యలతో బాధపడుతున్న పశువులకు మందు స్ప్రే చేయించారు. గోమార్లు నివారించడం ద్వారా పశువుల్లో ప్రొటోజోల్ వ్యాధులు తగ్గుతాయన్నారు. అలాగే రక్తహీనత తగ్గి పునరుత్పత్తి సామర్థ్యం, పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మారుతి, విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, చంద్రశేఖర్, సుధాకర్, సుధాకర్‌నాయక్, ఎర్రిస్వామి, అశోక్, మారుతి, వంశీకృష్ణ, సుదర్శన్, పూర్ణిమ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే ధ్యేయం


వెల్నెస్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అనంతపురం

వికసిత్ భారత్.. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యసాధనే ధ్యేయమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నగరంలోని సర్వజన ఆసుపత్రి ఆవరణలో ఉన్న డిఇఐసి భవనంలో వెల్నెస్ క్లినిక్ (ప్రివెంటివ్ క్లినిక్)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్నెస్ క్లినిక్ ద్వారా మధుమేహం, రక్తపోటు వంటి వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, శారీరక శ్రమ సూచనలు, సలహాలు అందించేందుకు దోహదపడుతుందన్నారు. తద్వారా ఆరోగ్య అక్షరాస్యతను ప్రోత్సహించి, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు, అవుట్ ఆఫ్ పాకెట్ ఖర్చులను తగ్గించేందుకు సహాయ పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక వైద్యశాస్త్ర విభాగం అధినేత డాక్టర్ మధు, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ వాల్మీకి శ్రీనివాస్, డాక్టర్ ఆది, నటేష్, ఆర్ఎంఒ, తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌స్పాట్స్ గుర్తింపు

ప్రజాశక్తి-రాయదుర్గం



జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్‌ను పరిశీలిస్తున్న ఎంవిఐ విశ్వనాథరెడ్డి, పోలీసు సిబ్బంది

తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాల వద్ద రోడ్డుపై బ్లాక్‌స్పాట్లను రవాణాశాఖ అధికారులు మంగళవారం గుర్తించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రవాణా శాఖ రాయదుర్గం మోటార్ వాహనాల తనిఖీ అధికారి విశ్వనాథరెడ్డి, పోలీసు సిబ్బందితో కలిసి రాయదుర్గం-అనంతపురం 544 డిడి జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్‌ల తనిఖీ చేశారు. ఇందులో భాగంగా బెళుగుప్ప పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండ్లపల్లి క్రాస్‌లో ఒక బ్లాక్‌స్పాట్, రాయదుర్గం టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆవులదట్ల గ్రామంలో మరో బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. అనంతరం ఆయా బ్లాక్‌స్పాట్‌లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు.


పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

పంటకోత ప్రయోగం

పుట్లూరు : మండల పరిధిలోని శనగలగూడూరు రెవెన్యూ గ్రామంలో ఎఒ కాత్యాయిని ఆధ్వర్యంలో బుధవారం పప్పుశనగ పంటలో పంట కొత్త ప్రయోగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ హరి, విఎఎ భార్గవి, ఎంపిఇఒ నాగలింగేశ్వర, బీమా ఏజెంట్ షమీర్, రైతులు పాల్గొన్నారు.

6 నుంచి రాష్ట్ర మహాసభలు

కళ్యాణదుర్గం రూరల్ : శ్రీకాకుళం జిల్లాలో వచ్చేనెల 6వతేదీ నుంచి నిర్వహించనున్న ఎఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం పట్టణంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు రజినీ, బాలు, తరుణ్, అమీర్, వెంకటేష్, అలీషా, రామ్‌చరణ్, ప్రకాష్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

డి.హీరేహాళ్ : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి పవిత్ర వన్నూరుస్వామి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దాసానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు నాయకులు జగన్, ఉమాగౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు జగన్, ఉమాగౌడ్

ప్రజాశక్తి-తాడిపత్రి

బీడీ కార్మికుల పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలని సిఐటియు సిఐటియు నాయకులు జగన్మోహన్‌రెడ్డి, ఉమాగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తాడిపత్రిలో వేలాది మంది కార్మికులు 25ఏళ్లుగా బీడీ రోలింగ్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకొచ్చినా బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో, లేబర్ గుర్తింపు కార్డులు ఇవ్వడంలో, కూలీరేట్లు పెంచడం వంటి సమస్యలపై చొరవ చూపటం లేదన్నారు. నిత్యావసరాల ధరలు, ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, పిల్లల స్కూల్ ఫీజుల ఆకాశాన్ని అంటుతున్నా బీడీ కార్మికుల కూలి రేట్లు మాత్రం అంతంత మాత్రమే ఉన్నాయన్నారు. బీడీ కార్మికులకు కూలి రేట్లు పెంచకుండా బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఇప్పటికైనా బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించి కూలి రేట్లు పెంచడంతోపాటు కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, లేబర్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, రవికుమార్, సాలెం రాజు, రవి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయండి

మేయర్ మహమ్మద్ వసీం



కొనుగోలు చేసిన వీధిదీపాలు, పుష్‌కార్డులను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం, నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో అవసరమైన అన్నిప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని మేయర్ మహమ్మద్ వసీం ఆదేశించారు. నూతనంగా కొనుగోలు చేసిన వీధి దీపాలు, పుష్ కార్ట్‌లను డిప్యూటీ మేయర్ వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డి, కమిషనర్ మల్లికార్జునరెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రూ.30 లక్షలతో 682 వీధిలైట్లు, రూ.10లక్షలు వెచ్చించి 47 పుష్ కార్ట్‌లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరిన ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించామన్నారు. అదేవిధంగా నగరంలో పారిశుధ్య మెరుగుకు నూతనంగా 47 పుష్‌కార్ట్‌లను అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. వీటి ఏర్పాటు ద్వారా ఇంటింటి చెత్త సేకరణ సులభతరమవుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ పాలకవర్గం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లా, అబూసాలేహా, బాలాంజనేయులు, శేఖర్‌బాబు, ఇఇ షాకీర్‌హుస్సేన్, డిఇ ద్రాక్షాయణి, ఎఇ సాయినాథ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-యాడికి

గ్రామాల్లో నెలకొన్న ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని నగరూరు, తూట్రాళ్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ముందుగా నగరూరులో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా 15ఏళ్లుగా ఎస్సీ కాలనీలో అపరిష్కృతంగా ఉన్న దారి సమస్యను కాలనీలోకి వెళ్లి పరిశీలించారు. దారి సమస్యను త్వరగా పరిష్కరించాలని తహశీల్దార్ ప్రతాపరెడ్డిని ఆదేశించారు. అలాగే గ్రామంలో మురికినీటి సమస్య అధికంగా ఉండటంతో కొత్త కాలువలు నిర్మించి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ, జెఇఇలను ఆదేశించారు. అలాగే స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం తూట్రాళ్లపల్లిలో గ్రామసభలో ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇక్కడ కూడా ఐదేళ్లుగా రస్తా విషయంలో రెండు కుటుంబాల ఘర్షణ పడుతుండటంతో ఆ ప్రాంతానికి వెళ్లి సమస్యను పరిష్కరించాలని ఇఒఆర్‌డిని ఆదేశించారు. యాడికి కాలువకు నీళ్లు వదలాలని కొంతమంది రైతులు కోరగా వచ్చే ఏడాది విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రతాపరెడ్డి, ఎంపిడిఒ వీర్రాజు, సిఐ ఈరన్న, ఇఒఆర్‌డి శశికళ, ఎపిఎం చంద్రశేఖర్, ఎఒ వీరస్వామి, మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, పరిమి చరణ్, రవికుమార్‌రెడ్డి, నాగమునిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గండికోట లక్ష్మణ్, శ్యాంసుందర్, వెంకట నారాయణరెడ్డి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం..

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని అర్హులందరికీ స్థలాలతోపాటు ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. 'మీ ఇంటికి మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా నగరంలోని 35వ డివిజన్ మంగళవారి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా డ్రెయినేజీ, వీధి లైట్లు, విద్యుత్ పోల్స్, తాగునీరు, ఇళ్లపట్టాల వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి హయాంలో నగరంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. అంతేగాకుండా గత ప్రభుత్వం ఇళ్లు కట్టిస్తామని పేదలతో డబ్బులు వసూలు చేసి మోసం చేశారన్నారు. ఎవరూ అధైర్య పడవద్దని ఈ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాజారావు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పిఎల్ఎన్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అలివేలమ్మ

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి : ఎంపిడిఒ

పుట్లూరు : మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఎంపిడిఒ అలివేలమ్మ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. అదేవిధంగా మినీ గోకులాలను త్వరగా పూర్తి చేయించాలని సూచించారు. వీటితోపాటు ఇంకుడు గుంతలు తీయించాలని, అమృత సరోవరం పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ నరేంద్ర, టిఎలు, బీఎఫ్‌టిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఊరు దేవర

బొమ్మనహాళ్ : మండలంలో బుధవారం నిర్వహినంచిన ఊరు దేవర ఘనంగా నిర్వమించారు. దేవరకు రాష్ట్రంలోని భక్తులతోపాటు కర్ణాటక, ఆంధ్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ప్రధాన రహదారి కనేకల్-బళ్లారి పూర్తిగా స్తంభించిపోయింది. ఉత్సవంలో విప్ కాలవ శ్రీనివాసులు, హిందూపురం ఎంపి పార్థసారథి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఐ నబిరసూల్ పోలీసు బందోబస్తు చేపట్టారు.

రస్తా పనులు పరిశీలన


గ్రామ రస్తా పనులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వసంతబాబు

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని రాయలప్పదొడ్డి గ్రామ రస్తా పనులను ఆర్‌డిఒ వసంతబాబు బుధవారం పరిశీలించారు. వారం రోజుల నుంచి రస్తా సమస్య ఉన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రస్తా మ్యాపింగ్, పనులను స్థానిక తహశీల్దార్ సుమతిని అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రస్తా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనాథ్, ఆర్ఐ నాగిరెడ్డి, విఆర్ఒలు అనిమేష్, లక్ష్మన్న, మర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.


రథం మరమ్మతులకు విరాళం అందజేస్తున్న దృశ్యం

రథం మరమ్మతులకు విరాళం

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని పట్టాభి రామస్వామి దేవస్థానం రథం మరమ్మతులకు దేవినేని ధర్మతేజ, దేవినేని నవీన్ కలిసి రూ.3.50లక్షలు బుధవారం విరాళంగా అందజేశారు. ఈమేరకు సంబంధిత మొత్తానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తనయుడు అమినినేని యశ్వంత్‌తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రం సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఎస్ఐ వెంకట నరసింహా ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా అధిక లోడుతో వెళ్తున్న వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు లేని వాహనాలకు అపరాధ రుసు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలన్నారు. ఆటో వాళ్లు అధిక లోడుతో వెళ్లకుండా డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకటనరసింహా

అభయ ఎంఆర్‌ఎఫ్ టైర్ల షోరూం ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో కొండాపురం మాజీ సర్పంచు అనిల్‌చౌదరి ఏర్పాటు చేసిన అభయ ఎంఆర్‌ఎఫ్ టైర్ల షోరూంను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు బుధవారం ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనిల్‌చౌదరి పట్టణంలో టైర్ల షోరూం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ఎంఆర్‌ఎఫ్ టైర్ల హెడ్ జగదీశ్వర్‌రావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం కలెక్టరేట్ : నగరంలో టిడిపి అర్బన్ కార్యాలయంలో అనారోగ్య బాధితులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగా వివిధ రోగాలతో బాధపడుతున్న ఐదుగురికి రూ.4.23లక్షల చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న శివకృష్ణ ట్రస్టు సభ్యులు

నార్పల : మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఉన్న ఓ ఇంటి వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఆటో దగ్ధమై నష్టపోయిన బాధిత కుటుంబానికి శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బొందలవాడ శివకృష్ణచౌదరి బుధవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. శివాలయం వద్ద నివాసం ఉంటున్న అద్దంకి చెందిన 8మంది వలస వ్యాపారులు మంగళవారం రాత్రి ఆటోతో పాటు జీవనధారమైన స్టీల్ సామాన్లను ఒకచోట పెట్టి పడుకున్నారు. అయితే అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగి స్టీల్ సామాన్లతోపాటు ఆటో పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న శివకృష్ణచౌదరి బుధవారం బాధితులకు రూ.10వేలు ఆర్థికసాయం చేశారు.

చెత్తతో సంపద కేంద్రాల పరిశీలన



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్

పామిడి : మండలంలోని వంకరాజుకాలువ, ఎద్దులపల్లి గ్రామాల్లో వినియోగంలో ఉన్న చెత్త సంపద కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు పొడి చెత్త, తడి చెత్తపై అవగాహన కల్పించడంతోపాటు పని చేయని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తేజోష్ణ, ఇఒఆర్‌డి కృష్ణకుమార్, ఆయా పంచాయతీల అధికారులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతర


రాతిదూలం పోటీలను ప్రారంభిస్తున్న ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ పామిడి వీరా

పామిడి : పామిడిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంకాలమ్మ, కుంటెమ్మ జాతర బుధవారం ముగిసింది. ఇందులో భాగంగా చివరి రోజు పూజారి నాగన్న దంపతులు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం న్యూ కేటగిరి ఎద్దుల దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో 15 జతల ఎద్దులు పాల్గొన మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందించారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతిచెందిన వ్యక్తి

డి.హీరేహాళ్ : మండలంలోని ఓబుళాపురం గ్రామ శివారులో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మృతదేహాన్ని చూసిన ఓబుళాపురం గ్రామస్తులు వెంటనే ఎస్ఐకు సమాచారం అందించారు. ఎస్ఐ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆయన రాయదుర్గం రూరల్ సిఐ వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లారు. సిఐ కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడు మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన సంచార జాతికి చెందిన వ్యక్తిగా అనుమానం వ్యక్తం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సోలార్ ప్లాంట్‌లో కేబుల్ వైర్లు చోరీ


చోరీ జరిగిన సోలార్‌ప్లాంట్, వైరు

గుత్తి : మండలంలోని ఎంగిలిబండ గ్రామ శివారులో ఉన్న సోలార్ ప్లాంట్లో ఇద్దరు దొంగలు చోరీ చేసేందుకు ప్యానళ్లకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించారు. ప్లాంట్ యజమాని గోపాల్‌రెడ్డి ఎంగిలిబండ గ్రామ శివారులో ఉన్న సోలార్ ప్లాంట్‌లోకి మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇద్దరు గుర్తు తెలియని యువకులు చొరబడి ప్యానెళ్లకు ఉన్న రూ.15లక్షలు విలువజేసే కేబుల్ వైర్లను కట్ చేశారు. వాటిని చోరీ చేసి తీసుకెళ్లే సమయంలో సోలార్ ప్లాంట్లో కాపలా ఉన్న సెక్యూరిటీ సిబ్బంది గమనించి పారిపోతున్న ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసుల అదుపులో ఉన్న వారిలో ఒకరు గుత్తి మండలం జక్కలచెరువు గ్రామానికి చెందిన యువకుడు కాగా, మరో యువకుడు కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రోళ్లపాడు తండాకు చెందిన వాడిగా గుర్తించారు. వీరు గతంలో కూడా ఇదే సోలార్ ప్లాంట్‌లో రెండుసార్లు చోరీలకు పాల్పడ్డారని సోలార్ ప్లాంట్ యజమాని తెలిపారు. 200 సోలార్ ప్యానెళ్లకు ఉన్న కేబుల్ వైర్లు కట్ చేయడంతో రూ.15 లక్షలునష్టం వాటిల్లిందని యజమాని వాపోయారు. సోలార్ ప్లాంట్‌లో చోరీకి పాల్పడిన కేబుల్ వైర్ల నుంచి వేరు చేసిన కాపర్‌ను పెద్దవడుగూరు మండలం తెలికి గ్రామంలో ఉన్న గుజరీలలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్లాంట్ యజమాని గోపాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.